# సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం, 3, ఫిబ్రవరి, 2023




**తుదిదశకు ఎస్‌పీఎల్**

'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో సాగుతున్న ఎస్‌పీఎల్ తుది దశకు చేరుకుంది.

వివరాలు 8లో ▸



**వైభవంగా గజవాహన సేవ**

మన్యంకొండలో గురువారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి గజవాహన సేవ నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 33.0 /19.0

**వాతావరణం**

ఉదయం, రాత్రి సమయాల్లో చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఆంజనేయుడి సన్నిధిలో జెడ్పీచైర్‌పర్సన్ పూజలు



**ధరూరు:** మండల పరిధిలోని పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాశస్త్యాన్ని గురించి అర్చకులు కిష్టాచార్యులు జెడ్పీచైర్‌పర్సన్‌కు వివరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావుపాల్గొన్నారు.

### పశు సంపదను సంరక్షించుకోవాలి



**ధరూరు:** మూగజీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండటంతో పాటు పశుసంపదను సంరక్షించుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండల పరిధిలోని మార్లబీడులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రూస్లోసిస్ వ్యాక్సిన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి రైతు తమ పశువులపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. అంతే కాకుండా సీజనల్‌గా వచ్చే పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండి పశువులను బాగు చేయించుకోవాలన్నారు.

### రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన లక్ష్మీ

**గద్వాల అర్బన్:** రాష్ట్ర కబడ్డీ జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఎంపికైంది. అయిజ మండలం, పులికల్‌కి చెందిన లక్ష్మీ జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. కబడ్డీలో అండర్ -18 విభాగంలో రాణిస్తుంది. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైంది. ఈ నెల 5వ నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలో కొనసాగనున్న ఖేలో ఇండియా కబడ్డీ పోటీల్లో ఆమె రాష్ట్ర జట్టు తరపున పాల్గొననుంది. ఈ నేపథ్యంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు బీఎస్ కేశవ్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాకు చెందిన లక్ష్మీ కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఖేలో ఇండియా కబడ్డీ పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

# మోక్షమెప్పుడో?



ర్యాలంపాడు రిజర్వాయర్‌కు బీటలు పడడంతో లీకేజీ అవుతున్న నీరు

**మూడేళ్ల కిందట ర్యాలంపాడు జలాశయానికి బీటలు**

- రూ.57 లక్షలతో సర్వే పనులు పూర్తి
- మూడు అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక
- ఈ వేసవిలో మరమ్మతు చేపట్టకుంటే మరో ఏడాది వరకు రైతులకు తప్పని ఎదురుచూపులు
- ఇప్పటికే ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందక అన్నదాతల ఆవేదన



జలాశయం కింద ఎండిపోయిన వరిపంట

**గద్వాల రూరల్:** నడిగడ్డ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు జలయజ్ఞంలో భాగంగా నెట్టెంపాడు ప్రాజెక్టును చేపట్టారు. 22 టీఎంసీల సామర్థ్యంతో 2 లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు రూ.1,427 కోట్లతో పనులు ప్రారంభించారు. 2014 వరకు సుమారు 90 శాతం మేర పనులు పూర్తి చేశారు. ఇందులో 14 ప్యాకేజీలుగా విభజించి చేపట్టిన పనుల్లో 7 జలశయాలు, 2 లిఫ్టులున్నాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో అతిపెద్ద జలాశయంగా ఉన్న ర్యాలంపాడును 4 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. దీని కింద 1.36 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించనున్నారు. ఇంత ప్రతిష్టాత్మంగా నిర్మించిన ర్యాలంపాడు జలాశయానికి మూడేళ్ల కిందట బీటలు పడ్డాయి. దీంతో జలాశాయం అడుగుభాగం రాక్‌టోల్ నుంచి పెద్దఎత్తున నీరు లీకేజీ అవుతుంది. దీనిని గుర్తించిన అధికారులు లీకేజీలకు కారణాలను తెలుసుకునేందుకు సర్వే చేపట్టారు.

**ఏజెన్సీకి సర్వే పనులు..**

లీకేజీపై సమగ్ర నివేదికను కోరుతూ.. ప్రభుత్వం హైదరాబాద్‌కు చెందిన ఓ ఏజెన్సీకి రూ.57 లక్షలతో సర్వే పనులు అప్పగించింది. గతేడాది ఆగస్టు నెలలో సర్వే పనులు మొదలుపెట్టిన ఏజెన్సీ నాలుగు నెలల పాటుగా పనులు చేపట్టి డిసెంబర్ నెలలో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

**ఎండుతున్న పంటలు..**

ఈ క్రమంలో నీరు సమృద్ధిగా అందుబాటులో లేకపోవడంతో నీటి విడుదలలో అధికారులు వారబందీ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయిదు ఆరు రోజులకోసారి కాల్వలకు నీటిని విడుదల చేస్తుండటంతో సాగు చేసే పంటలకు నీరు అందకుండా పోతుంది. దీంతో కొన్ని చోట్ల సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యం...**

ర్యాలంపాడు జలాశయ నిర్మాణం లోపభూయిష్టంగా చేయడంతో లీకేజీలు ఏర్పడ్డాయని సాగునీటి నిపుణుల కమిటీ తేల్చేసింది. వాస్తవానికి ర్యాలంపాడు జలాశయానికి మూడేళ్ల పాటు మాత్రమే పూర్తిస్థాయిలో అంటే 4 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. మూడేళ్ల కాల వ్యవధిలోనే జలాశయానికి బీటలు ఏర్పడి పెద్ద ఎత్తున లీకేజీ కావడం ఒకింత ఆందోళన కలిగించేస్తుంది. అదేవిధంగా జలాశయ నిర్మాణానికి సంబంధించి సాగునీటి అధికారులు పర్యవేక్షణతో పాటు ప్రత్యేకంగా క్వాలిటీ కంట్రోల్ విభాగం కూడా పర్యవేక్షిస్తుంది. ఈ రెండు విభాగాల అధికారులు నాణ్యత ప్రమాణాలతో పాటు పనులను చేపట్టేలా పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారు.

**ఎదురుచూపులు తప్పవా..**

మరమ్మతుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తే.. ఈ ఎండాకాలంలో పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. లేకుంటే రైతులకు మరో ఏడాది పాటు ఎదురుచూపులు తప్పేలా లేవు. రెండేళ్లుగా జలాశయంలో కేవలం సగం వరకే (2 టీఎంసీల) నీటిని నిల్వ చేస్తూ.. దాని కింద ఉన్న లక్ష ముప్పై ఆరు వేల ఎకరాలకు నీటిని అందిస్తున్నారు.

**మరమ్మతుకు రూ.100 కోట్లపైనే..**

లీకేజీలకు కారణాలను పేర్కొంటూ జలాశయం అడుగు భాగంలో పొరలుపొరలుగా నిర్మించిన ఫిల్టర్ బెడ్ నుంచి నేరుగా నీరు లీకేజీ అవుతున్నట్లుగా గుర్తించారు. వీటిని సమగ్రంగా మరమ్మతు చేయాలంటే రూ.100 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని ఏజెన్సీ సమర్పించిన అంచనా నివేదికలో పేర్కొన్నారు. వాస్తవానికి ర్యాలంపాడు జాలాశయాన్ని సుమారు దశాబ్దంన్నర కిందట రూ.160 కోట్లను ఖర్చు చేసి నిర్మించారు. తాజాగా రాక్‌టోల్ నుంచి లీకేజీ అవుతున్న నీటిని పూర్తిస్థాయిలో కట్టడి చేయాలంటే సుమారు రూ.100 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. అంటే జలాశయం పూర్తి నిర్మాణానికి అయిన వ్యయంలో 60 శాతానికి పైగా నిధులను కేవలం మరమ్మతుకు ఖర్చు చేయాల్సి పరిస్థితి నెలకొంది.

**మరమ్మతు త్వరగా చేపట్టాలి..**



నాకు 3 ఎకరాల పొలం ఉంది. దీనికి ర్యాలంపాడు జలాశయం నుంచి నీరు వస్తుంది. ఎకరం పొలంలో వరి, మిగితా రెండు ఎకరాల్లో మినుము పంటలను సాగు చేశాను. అయితే పంటలకు నీరు పారడం లేదు. దీనిపై అధికారులను అడిగితే జలాశయానికి లీకేజీ ఏర్పడిందని, మరమ్మతు చేపడితేనే నీరు పూర్తిగా ఇవ్వడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి త్వరగా మరమ్మతు పనులను చేపట్టాలి.

– గద్దమీది చిన్న బీసన్న, అమరవాయి, మల్దకల్ మండలం

**ఐదు రోజులకోసారి నీరు**



నాకు ర్యాలంపాడు జలాశయం కింది 5 ఎకరాల పొలం ఉంది. ఇందులో వరి, బొబ్బర్ల పంటలను సాగు చేస్తున్నాను. అయితే అయిదారు రోజులకోసారి నీటిని విడుదల చేయడంతో పంట లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు స్పందించడం లేదు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి జలాశయానికి మరమ్మతు చేపట్టాలి.

– వీరేష్, ధరూర్

**నెలాఖరు నాటికి తుది నివేదిక...**



మరమ్మతుపైన సర్వే చేపట్టిన ఏజెన్సీ ఇప్పటికే నివేదిక సమర్పించగా.. దీనిపై ఇంజినీరింగ్ నిపుణుల కమిటీ ఓరల్ డాటాతో తుది నివేదికను కోరింది. వారం రోజుల్లో నిపుణుల కమిటీ తుది నివేదికను ఇస్తుంది. ఈ తుది నివేదికను ఈ నెలాఖరు నాటికి ప్రభుత్వానికి సమర్పిస్తాం. దీనిపై ప్రభుత్వం ఖరారు చేసి నిధులను విడుదల చేస్తే ఈ వేసవిలోనే మరమ్మతులు చేపడుతాం.

– శ్రీనివాస్ రావు, జిల్లా ఇరిగేషన్ శాఖ, ఎస్ఈ

# 'మన ఊరు – మన బడి' పనులు పూర్తిచేయండి

**అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్**



బృహత్‌ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్

**మానవపాడు:** మన ఊరు– మన బడి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లకు జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ ఆదేశించారు. గురువారం మండలంలోని మానవపాడు, కొర్విపాడు, అమరవాయి గ్రామాల్లో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాధ్యమైనంత త్వరగా గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. కొర్విపాడులో రెవెన్యూ అధికారులు 3 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారని, ఆ స్థలాన్ని పరిశీలించి ఈ స్థలంలో మొక్కలు నాటేందుకు అనుకూలంగా తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మానవపాడులో కంటివెలుగు కార్యక్రమాన్ని పరిశీలించి రిపోర్టు పరిశీలించారు. అమరవాయిలో మన ఊరు– మన బడి పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణరావు, ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు మహేష్, అశోక్, నిర్మల, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు పనిచేయండి

**ఎస్పీ సృజన**



మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ సృజన

**అయిజ:** పోలీస్ స్టేషన్‌లో అధికారులు నిబంధనల మేరకు పనిచేయాలని, కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఎస్పీ సృజన ఆదేశించారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. మండలంలోని గ్రామాల వివరాలు, జాతరలు, ఉత్సవాల తేదీలను, నిర్వహించే విధానం గురించి శాంతినగర్ సీఐ శివశంకర్‌గౌడ్, అయిజ ఎస్ఐ నరేష్‌కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కేసులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు చార్జ్‌షీట్ వేయాలని, క్లిష్టమైన కేసులు ఉంటే ఎస్పీ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ లోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మల్దకల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ**

**మల్దకల్:** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సృజన ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. వివిధ కేసుల నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాల్లో పేకాట, కోడిపందెలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రాత్రి వేళలో గస్తీ నిర్వహించాలన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

**పాత నేరస్తులపై నిఘా..**

**గట్టు:** ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఎస్పీ సృజన గట్టు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఫిర్యాదుల స్వీకరణ విభాగం, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, సరిహద్దు ప్రాంతంలో రాకపోకలపై నిరంతరం నిఘా ఉండాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలన్నారు. ఎస్పీ వెంట సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ పవన్‌కుమార్, ఏఎస్ఐ రాంచందర్‌జీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఎమ్మెల్యే అబ్రహంను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**అయిజ:** పట్టణంలో ఈ నెల 8 నుంచి 21 వరకు నిర్వహించే తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిలుగా హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు వివిధ ప్రజాప్రతినిధులకు గురువారం వారి నివాసాలు, కార్యాలయాల వద్దకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీచైర్మన్ సరితను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అదేవిధంగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహంను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్‌కు, గద్వాల మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ప్రతాప్ గౌడ్‌కు, గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌కు వారి కార్యాలయాల వద్ద ఆహ్వాన పత్రికలను అందజేశారు. అదేవిధంగా కర్నూల్‌లో చల్లా వెంకట్రామిరెడ్డికి ఆయన నివాసంలో ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, ఆలయ పూజారి లక్ష్మిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సొంత భవనాలు ఏవీ?

- అద్దె ఇళ్లలో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగింపు
- మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు
- ప్రతిపాదనలు పంపించని అధికారులు



అలంపూర్‌లో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ఏడీఏ కార్యాలయం

**అయిజ:** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నా.. సొంత కార్యాలయ భవనాలు నిర్మించకపోవడంతో వ్యవసాయ అధికారులు, రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్ద పథకాలు అమలవుతున్నా.. మండలానికి ఒక సొంత వ్యవసాయ కార్యాలయం లేకపోవడం శోచనీయం. జోగుళాంబ గద్వాల జిల్లాలో మొత్తం 5.40లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. 1.58 లక్షల మంది రైతులు ఉన్నారు. గద్వాల, ధరూరు, మానవపాడు, వడ్డేపల్లి, ఇటిక్యాల మండల కేంద్రాల్లో మాత్రమే వ్యసాయ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి.

**అద్దె భవనాల్లో కొనసాగింపు..**

జిల్లాలోని కొన్ని మండల కేంద్రాల్లో వ్యవసాయ కార్యాలయాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నారు. మరికొన్ని మండలాల్లో ఇతర శాఖల కార్యాలయాల్లో అగ్రికల్చర్ ఆఫీసర్లు విధులను నిర్వహిస్తున్నారు. కనీసం ఈడీఏ ఆఫీస్‌కు సంబంధించిన సొంతభవనం లేకపోవడం శోచనీయం. గతంలో ఒక జిల్లాకు ఒక ఏడీఏ కార్యాలయం ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఒక నియోజకవర్గానికి ఒక ఏడీఏ కార్యాలయం ఉండాలని నిబంధనలు చేశారు. దాంతో జోగుళాంబ గద్వాల జిల్లాలో అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు ఇద్దరు ఏడీఏలను ఏర్పాటు చేశారు. అలంపూర్ నియోజకవర్గ కేంద్రంలో అద్దె భవనంలో ఏడీఏ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఎలాంటి వసతి లేకపోవడంతో అధికారులు, రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

**గద్వాల నియోజకవర్గంలో..**

నియోజకవర్గ కేంద్రంలో గద్వాల, ధరూర్ మండలంలో మాత్రమే సొంత వ్యవసాయ కార్యాలయ భవనాలు ఉన్నాయి. డీఏఓ కార్యాలయానికి సొంత భవనం లేదు. మహిళా సమాఖ్య భవనంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కలెక్టర్ కార్యాలయ సముదాయ భవనాలు పూర్తయిన అనంతరం అక్కడ కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళిక చేశారు. ఏడీఏ కార్యాలయం లేదు. మండల వ్యవసాయ కార్యాలయంలోనే ఏడీఏ కార్యాలయం నిర్వహిస్తున్నారు. అదే కార్యాలయంలో ఏడీఏతో పాటు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఎంఏఓతో పాటు ఏఈఓలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మల్దకల్ మండలంలో సొంత కార్యాలయం లేదు. ఇదివరకు తహసీల్దార్ కార్యాలయంలోనే విధులు నిర్వర్తించారు. గత సంవత్సరం హౌసింగ్ కార్యాలయంలోకి మండల వ్యవసాయ కార్యాలయాన్ని మార్చారు. గట్టు మండలంలో వ్యవసాయ కార్యాలయం లేదు. అదేవిధంగా కేటీదొడ్డి మండలంలో వ్యవసాయ కార్యాలయం లేదు. ఇంతవరకు ప్రైవేటు భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించారు. ఇప్పుడు రైతువేదిక భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.



అలంపూర్‌లో అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

**అలంపూర్ నియోజకవర్గంలో ...**

నియోజకవర్గంలోని వడ్డేపల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలాల్లో మాత్రమే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయ కార్యాయంలో సమావేశాలు నిర్వహించేందుకు కనీసం 50 మంది కూర్చోవడానికి వసతి కల్పించాలి. కార్యాలయంలో బాత్‌రూంలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. కార్యాలయాలకు కంప్యూటర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అదేవిధంగా విత్తనాలను, ఎరువులను నిల్వ ఉంచడానికి గోదాంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి, ఇటిక్యాల, మానవపాడు మండలాల్లో తప్పా ఇతర మండలాల్లో వ్యవసాయ కార్యాలయాలకు మౌలిక వసతులు కరువయ్యాయి.

**ఇతర భవనాల్లో ఇబ్బందులు ...**

ఇంత వరకు అయిజ మండల వ్యవసాయ కార్యాలయాన్ని వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్‌లోని భవనంలో ఏర్పాటు చేశారు. ఆస్తి పన్ను చెల్లించనందుకు మున్సిపల్ అధికారులు గతేడాది భవనానికి తాళం వేశారు. • ఉండవెల్లి మండల కేంద్రంలో రైతు సంఘం కార్యాలయంలో వ్యవసాయ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. కేవలం కరెంట్ బిల్లును మాత్రమే వ్యవసాయ శాఖ చెల్లిస్తుంది. అద్దె చెల్లించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. • అలంపూర్‌లో వ్యవసాయ కార్యాలయ భవనం లేదు. ఏడీఏ కార్యాలయంలోని ఒకే గదిలో ఏడీఏతో పాటు మండల వ్యవసాయ అధికారి, అయిదుగురు ఏఈఓలు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

**ప్రతి మండలంలో గోదాం ఏర్పాటు చేయాలి..**



మండల వ్యవసాయ కార్యాలయానికి సొంత భవనాలు నిర్మించడంతో పాటు రైతులకు అందించే విత్తనాలు, ఎరువులను నిల్వ చేసుకునేందుకు ప్రతి మండలంలో గోదాంలను ఏర్పాటు చేయాలి. రైతులు వ్యవసాయ కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలి. రైతులతో సమావేశం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన సమావేశ మందిరం నిర్వహించాలి. తాగునీటితో పాటు, మరుగుదొడ్ల వసతి కల్పించాలి.

– రామచంద్ర, మాన్‌దొడ్డి, వడ్డేపల్లి మండలం

**ప్రతిపాదనలు పంపలేదు..**



మండల వ్యవసాయ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రతిపాదనలు పంపలేదు. సొంత భవనాలు లేని మండలాల్లో అద్దె భవనాల్లో అధికారులు విధులు నిర్వర్తించాలని సూచించాం. అద్దె భవనాలు దొరకని మండలాల్లో రైతు వేదిక భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారులకు సూచించాం.

– గోవిందనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

# పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



మురుగు గుంతలను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

**అయిజ:** పట్టణంలోని వివిధ కాలనీల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, దాంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం బీజేపీ కార్యకర్తలతో కలిసి రామచంద్రారెడ్డి మున్సిపాలిటీలోని 7, 17 వార్డుల్లోని వివిధ కాలనీల్లో ఏర్పడిన మురుగు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మిషన్ భగీరథ పేరుతో రోడ్లను తవ్వి వదిలేశారని విమర్శించారు. గుంతలను పూడ్చకపోవడంతో మురుగు ఏర్పడి దుర్వాసన వస్తుందని, కాలి నడకన నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉందని మండిపడ్డారు. వెంటనే రోడ్లకు మరమ్మతు చేసి పారిశుద్ధ్య పనులు చేపట్టకుంటే ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా దారి మళ్లించే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడించి ఇంటికి సాగనంపుతారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహయ్యశెట్టి, భీమసేనరావు, నాగరాజు, ప్రదీప్‌కుమార్, వీరేష్‌గౌడ్, లక్ష్మణాచారి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



మల్దకల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

**ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి**

**మల్దకల్:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్దెలబండ, మల్దకల్, కేజీబీవీ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి కలుసుకుని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత రెండు పీఆర్‌సీలతో పాటు ప్రభుత్వ, పంచాయతీరాజ్, మరియు రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాల ఉపాధ్యాయుల ఎన్నో సమస్యలను పరిష్కరించామన్నారు. ఉపాధ్యాయులకు ఏప్రిల్ మాసం నుంచి ఈహెచ్ఎస్ ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం లభిస్తుందన్నారు. భవిష్యత్‌లో అన్ని వర్గాల ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా అధ్యక్షుడు తిమ్మప్ప, వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌కుమార్, అంజనేయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యువకుడి బలవన్మరణం


మల్లేష్ (ఫైల్)

**వెల్దండ:** వ్యక్తిగత కారణాలతో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొల్లంపల్లి చెందిన మల్లేష్ (36) బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఉదయాన్నే కుటుంబసభ్యులు ఇంటికి వచ్చేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్యతో పాటుగా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**గోపాల్‌పేటలో..**

**గోపాల్‌పేట:** మండల కేంద్రంలోని రేకులగడ్డ కాలనీలో గురువారం వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రేకులగడ్డ కాలనీకి చెందిన ఉంద్యాల రాములు (36) పంక్చర్‌షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. ఇటీవల అప్పులు సైతం ఎక్కువయ్యాయి. గురువారం బయటికి వెళ్లిన అతను సాయంత్రం ఇంటికి వచ్చాడు. భార్య ఇంటికి దూరంగా ఉన్న సమయంలో ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కొద్దిసేపటికి భార్య వచ్చి చూడగా ఉరేసుకుని కనిపించాడు. చుట్టుపక్కల వారు వచ్చి కిందకి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, పాప, బాబు ఉన్నారు.

### పాము కాటుకు గురై వృద్ధుడి మృతి

**ఉప్పునుంతల:** మండల కేంద్రంలో పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే హన్మంతుయాదవ్ (68) గురువారం మధ్యాహ్నం వ్యవసాయ పొలంలో గేదెలను మేపడానికి వెళ్లాడు. వేరుశెనగ పంటలో వెళ్తుండగా పాము కాలుకు కాటు వేసింది. గమనించకపోవడంతో కొంత సేపటికి స్పృహ తప్పి పొలంలోనే పడిపోయాడు. గమనించిన పక్క పొలంలో రైతులు విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. 30ఏళ్లకు పైగా విరిగిన ఎముకలు అతకడానికి కట్లు కట్టడంలో ఈయనకు ఈ ప్రాంతంలో ఎంతో పేరు ఉంది. అతని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

### చికిత్స పొందుతూ వ్యక్తి..

**నాగర్‌కర్నూల్ క్రైం:** ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. బల్మూరు మండలం గట్టుతుమ్మెన్‌కు చెందిన తిరుపతయ్య (56) బుధవారం జిల్లాకేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయంలో తన కొత్త ద్విచక్రవాహాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. హౌసింగ్‌బోర్డు ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన తిరుపతయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### బాలికపై అత్యాచారయత్నం

**అమరచింత:** మండలంలో బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాలికకు జ్వారడంతో ఆస్పత్రికి తండ్రితో కలిసి వచ్చింది. ఇంటికి ఒంటరిగా వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడు తాగిన మైకంలో మాయమాటలు చెప్పి బైకుపై తీసుకెళ్లాడు. ఈ క్రమంలో అత్యాచారయత్నంకు పాల్పడుతుండగా తప్పించుకుని పరుగు తీసింది. వెంటనే బాలికను బైక్‌పై గ్రామానికి తీసుకొచ్చి వదిలాడు. విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు తెలిపారు.

### నల్లమల డోలు కళాకారుడు మృతి

**అమ్రాబాద్:** పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన నల్లమల డోలు కళాకారుడు గొంగ్లల నారాయణ(85) గురువారం ఉదయం మృతి చెందారు. పౌరాణిక, యక్షగానం, భజన సాంఘీక నాటకాలకు డోలు వాయించి మంచి పేరు తెచ్చుకున్నాడు. ఈయన భార్య లక్ష్మమ్మ ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపంతో అతను అనారోగ్యానికి గురయ్యాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

### హత్యాయత్నం కేసు నమోదు

**నవాబుపేట:** మండలంలోని చెన్నారెడ్డిపల్లి చెందిన ఎరకలి చెన్నయ్యపై అదే గ్రామానికి చెందిన దాయాదులు ఎరకలి వెంకటయ్య, శ్రీను, మల్లేష్ భూవివాదంలో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. వారి దాడి నుంచి తప్పించుకుని చెన్నయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడని ఈ విషయంలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# తుదిదశకు ఎస్‌పీఎల్

- నేటితో ముగియనున్న మెగా టోర్నీ
- జూనియర్స్ ఫైనల్‌కు చేరిన ప్రభుత్వ బాలుర కళాశాల
- టోర్నీలో తొలి సెంచరీ నమోదు చేసిన డేవిడ్

**మహబూబ్‌నగర్ క్రీడలు:** సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలో ఎండీసీఏ మైదానంలో హోరాహోరీగా సాగుతున్న ఎస్‌పీఎల్ (సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్) తుది దశకు చేరుకుంది. జూనియర్స్ విభాగంలో ప్రభుత్వ బాలుర కళాశాల జట్టు ఫైనల్‌కు చేరింది. ఈ జట్టు శుక్రవారం కొట్టం జూనియర్ కళాశాలలో తుదిసమరంలో తలపడుతోంది. మరోవైపు సీనియర్ మ్యాచ్‌లు జోరుగు సాగుతుండగా.. టోర్నీ తొలి సెంచరీ నమోదు కావడం విశేషం. శుక్రవాం ఈ మెగా లీగ్ ముగియనుంది. ఎస్‌పీఎల్‌కు స్పాన్సర్‌గా సుధాకర్ పీవీసీ వ్యవహరిస్తున్నారు. పంచవటి ఆస్పత్రి యాజమాన్యం వారు క్రికెట్ మైదానంలో అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.

■ జూనియర్స్ విభాగంలో జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ప్రభుత్వ బాలుర కళాశాల జట్టు 57 పరుగుల తేడాతో ప్రతిభా కళాశాల–1 జట్టుపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ బాలుర కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో వికెట్ కోల్పోయి 122 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. జట్టులో తరుణ్ 34 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 66 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అభి (29 పరుగులు) రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రతిభా కళాశాల జట్టు 9.5 ఓవర్లలో 65 పరుగులకు ఆలౌటైంది. తరుణ్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.


డేవిడ్ (110 నాటౌట్: 44 బంతుల్లో 13X4, 7X6)


జూనియర్ విభాగం ఫైనల్‌కు వెళ్లిన ఆనందంలో ప్రభుత్వ బాలుర కళాశాల జట్టు

**4 వికెట్ల తేడాతో జేపీఎన్‌సీఈ విజయం**

మరో సీనియర్ విభాగం లీగ్ మ్యాచ్‌లో ఉత్కంఠ పోరులో జేపీఎన్‌సీఈ–2 జట్టు మూడు పరుగుల తేడాతో వాసవీ డిగ్రీ కళాశాల–2 జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జేపీఎన్‌సీఈ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 83 పరుగులు చేసింది. జట్టులో జోయబ్ 28 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వాసవీ డిగ్రీ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లకు 80 పరుగులు చేసింది. చంద్ర 2 వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను జోయబ్ అందుకున్నాడు.

**ఎస్‌వీడీసీ గెలుపు**

వివేకానంద డిగ్రీ కళాశాల (ఎస్‌వీడీసీ) జట్టు 6 వికెట్ల తేడాతో వాసవీ డిగ్రీ కళాశాల–1 జట్టుపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన వాసవీ డిగ్రీ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్లకు 90 పరుగులు చేసింది. జట్టులో రహెమాన్ 21 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌వీడీసీ జట్టు 9 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. జట్టులో నవీన్ 35 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

■ మరో సీనియర్ లీగ్ మ్యాచ్‌లో జేపీఎన్‌సీఈ–1 జట్టు 9 వికెట్ల తేడాతో వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల–2 జట్టుపై ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వనపర్తి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 8 వికెట్లకు 67 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన జేపీఎన్‌సీఈ 8 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 71 పరుగులు చేసింది. జట్టులో మణికంఠ 34 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**డే–3 (మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌లు)**


తరుణ్ (ప్రభుత్వ బాలుర)


జోయబ్ (జేపీఎన్‌సీఈ–2)


డేవిడ్ (ఎంవీఎస్)


నవీన్ (ఎస్‌వీడీసీ)


మణికంఠ (జేపీఎన్‌సీఈ–1)





**డేవిడ్ మెరుపు సెంచరీ..**

సాక్షి ప్రీమియర్ లీగ్‌లో తొలి సెంచరీ నమోదైంది. సీనియర్ విభాగం మ్యాచ్‌లో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల జట్టు ఓపెనర్ డేవిడ్ అజేయ సెంచరీతో రాణించాడు. దీంతో ఎంవీఎస్ డిగ్రీ కళాశాల జట్టు 89 పరుగుల తేడాతో వనపర్తి డిగ్రీ కళాశాల–1 జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఎంవీఎస్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో వికెట్ కోల్పోయి 141 పరుగులు చేసింది. జట్టులో ఓపెనర్ డేవిడ్ 44 బంతుల్లో 13 ఫోర్లు, 7 సిక్స్‌లతో 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మరో ఓపెనర్ శ్రీకాంత్‌తో కలిసి డేవిడ్ మొదటి వికెట్‌కు 59 బంతుల్లో 141 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వనపర్తి జట్టు 9 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసింది. డేవిడ్ బౌలింగ్‌లో ప్రతిభ కనబరిచాడు. 2 ఓవర్లలో 10 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా డేవిడ్ నిలిచాడు.

### నమ్మించి మోసం

- వాటర్‌ట్యాంకు వ్యాపారంలో అధిక లాభాలని ఆశ
- వ్యక్తిగత సమాచారం తెలిపిన బాధితుడు
- బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

**గద్వాల క్రైం:** నమ్మించి మోసం చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. గద్వాల పట్టణ రెండవ ఎస్‌ఐ అబ్దుల్ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం పాల్వాయి గ్రామానికి చెందిన గౌని వెంకట్‌రాంరెడ్డికి గత నెల 28న గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. వాటర్‌ట్యాంకుల వ్యాపారంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పారు. అయితే తన వ్యక్తిగత ఖాతా వివరాలు తెలపాలని వారు కోరారు. డబ్బులు కాకుండా సమాచారం అడగడంతో వారిని నమ్మి ఆయన వ్యక్తిగత, బ్యాంకు వివరాలను పూర్తిగా చెప్పాడు. కాగా గురువారం తన ఖాతా నుంచి రూ.1.70లక్షలు డ్రా చేసినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో గద్వాల పట్టణంలోని బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా, ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు తెలిపారు. ఖంగుతిన్న బాధితుడు వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు వస్తే స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారం తెలపరాదని ఎస్‌ఐ సూచించారు.

### ఇసుక నిల్వలు సీజ్



**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలను గురువారం రెవెన్యూ, పోలీస్ అధికారులు సీజ్ చేశారు. కొంత మంది టిప్పర్ల ద్వారా అనుమతి లేకుండా ఇసుకను తరలించి ఎర్రవల్లి–గద్వాల రోడ్డులో ఉన్న శ్రీరామ్‌నగర్ కాలనీలో నిల్వ చేశారనే ఫొటోలో సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టాయి. స్పందించిన ఎస్‌ఐ గోకారి, ఆర్‌ఐ ప్రశాంత్‌గౌడ్ కాలనీలో ఇసుకను నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. 100 క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక ఉంటుందని, సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- హెల్మెట్ లేకపోవడంతోనే ప్రాణనష్టం


శంకర్ (ఫైల్)


శ్రీకాంత్ (ఫైల్)

**కల్వకుర్తి టౌన్:** మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేష్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడూర్ మండలం మేడిపూర్‌కు చెందిన శంకర్ (28) సొంత గ్రామంలోనే ఇంటర్‌నెట్ సెంటర్ నడుపుతున్నాడు. అందుకు సంబంధించిన పనుల నిమిత్తం కల్వకుర్తికి సాయంత్రం వచ్చాడు. పని ముగించుకుని తన స్కూటీపై ఇంటికి బయలుదేరాడు. పట్టణానికి చెందిన శ్రీకాంత్ తన ఇంటి పక్కన స్నేహితుడు హఫీజ్‌తో కలిసి బైకుపై బయటకు వచ్చాడు. నాగర్‌కర్నూల్ రోడ్డు నుంచి కల్వకుర్తి పట్టణం వైపు శ్రీకాంత్ (20), హఫీజ్ ఒక బైకుపై వస్తున్నారు. దీంతో నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదురుగా రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా అతివేగంతో ఢీకొనడంతో స్కూటీపై ఉన్న శంకర్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బైకుపై ఉన్న శ్రీకాంత్‌ను కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. హఫీజ్‌కు తలకు, ముఖంతో పాటు, ఇతర చోట్ల గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరికి హెల్మెట్ లేకపోవటంతో ప్రాణనష్టం అయ్యిందని పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి తెలిపారు. శంకర్‌కు ఇటీవల పెళ్లి నిశ్చయం కాగా, పెళ్లిపీటలు ఎక్కాల్సిన సమయంలో ఇలా మృత్యుఒడికి చేరటంతో వారి తల్లిదండ్రులు, బంధువుల రోదనలు ఆస్పత్రిలో మిన్నంటాయి. ఘటనపై ఫిర్యాదు రాలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

### అర్ధరాత్రి ఇంట్లో చోరీ

**నాగర్‌కర్నూల్ క్రైం:** జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన రామ్మోహన్‌రావు వినోబానగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. తన కొడుక్కి జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లి బుధవారం రాత్రి అక్కడే ఉన్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగొట్టి బీరువాలో ఉన్న రూ.3వేల నగదుతో పాటు అర తులం బంగారం, ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. రామ్మోహన్‌రావు గురువారం ఉదయం వచ్చి చూడడంతో ఇంటితాళం విరగొట్టి ఉండటంతో పాటు వస్తువులు చిందరవందరగా ఉండటంతో అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

# పంట సాగులో పసుపు అట్టల పాత్ర


మిర్చి పంటలో ఏర్పాటు చేసిన పసుపు అట్ట


పంటలో ఏర్పాటు చేసిన పసుపు రంగు అట్ట

**అలంపూర్:** పంట సాగులో పురుగు మందుల వినియోగం పెరిగింది. దేశంలో పురుగు మందుల వినియోగం 1955లో 200 టన్నులు ఉండగా ప్రస్తుతం 1,50,000 టన్నుల వినియోగం అవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ద్వారా తెలుస్తుంది. సమగ్ర సస్యరక్షణ ద్వారా ఈ పురుగు మందుల వినియోగాన్ని తగ్గించవచ్చని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు వివరించారు.

సమగ్ర సస్యరక్షణలో 4 పద్ధతులు ఉంటాయి. అందులో సాగు పద్ధి, యాంత్రీకరణ పద్ధతి, జీవ నియంత్రణ పద్ధతి, పర్యావరణ సహిత క్రిమి సంహారక మందులు.

యాంత్రిక పద్ధతులు సమగ్ర సస్యరక్షణతో ముఖ్య పాత్రను పోషిస్తాయి. అటువంటి వాటిలో కొన్ని..

- నారు మొక్కకు చివరులు తుంచి వేయుట.
- చీడ పీడలు ఆశించి భాగాన్ని తుంచి వేయుట.
- పక్షి స్థావరాలు ఏర్పాటు చేయుట.
- దీపపు ఎరలు నెలకోల్పుట.
- శత్రు గుడ్ల సముదాయాన్ని సేకరించి నాశనం చేయుట.
- రాత్రి పూట గుడ్లపై మంటలు వేయుట.
- పసుపు పచ్చ అట్టలు(జిగురు పూసిన) ఏర్పాటు చేసుకోవడం.

**ఎకరానికి 20 నుంచి 30 పసుపు అట్టలు**

టమాట, మిరప ఇతర పంటలల్లో రసం పీల్చే పురుగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా తెల్ల దోమ, పచ్చ దోమ, తామర పురుగుల ఉధృతి ఉంటుంది. తెల్ల దోమ వలన మిరప పంటకు జెమిని వైరస్, కుకుంబర్ మొజాయిన్ వైరస్ ఆశిస్తుంది. దీంతో పంటకు తీవ్రమైన నష్టాన్ని కలుగజేస్తుంది. వీటిని అరికట్టడానికి వినూత్నమైన సమగ్ర సస్యరక్షణలో భాగంగా పసుపు రంగు అట్టలు ఏ రకమైన పురుగునైనా ఆకర్షించే గుణం ఉంటుంది. ఈ పసుపు రంగు అట్టలను కట్టెలకు పెట్టి సాళ్ల వెంబడి క్రమ పద్ధతిలో అమర్చాలి. ఈ అట్టలకు జిగురు లేదా గ్రీసు పూస్తే ఈ జిగురుకు తెల్ల దోమ, పచ్చ దోమ, ఎర్ర నల్లి, తామర పురుగులు అంటుకుని చనిపోతాయి. దీంతో ముడత తెగులు పూర్తిగా తగ్గిపోతుంది. రసాయనిక పురుగుల మందులు వాడకుండా అతి తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగులను నియంత్రించే ఈ మ్యాజిక్ ప్లేటు ఎకరానికి 20 నుంచి 30 వరకు అమర్చుకోవాలి. దీనికి ఎకరాకు రూ.వెయ్యి వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

# ‘రామన్‌పాడు’ను పట్టించుకోరా?

- జలాశయం చుట్టూ ఆహ్లాదకర వాతావరణం
- వెళ్లేందుకు కనీస రహదారి కరువు


రామన్‌పాడు ప్రాజెక్టు వెళ్లే రోడ్డుపై గుంతలు


రామన్‌పాడు ప్రాజెక్టు (ఫైల్)

**మదనాపురం:** వనపర్తి జిల్లాలో రామన్‌పాడు జలాశయం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నా దాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రకృతి రమణీయ దృశ్యాలు, పక్షులు కిలకిల అరుపులు ఊకచెట్టు వాగు లాంటి చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయి. ఊకచెట్టు వాగు పొంగి పొర్లినప్పుడల్లా ప్రాజెక్టు గేట్లును ఎత్తి దిగువకు నీటిని దిగువకు అధికారులు విడుదల చేస్తారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివస్తారు. సరైన రహదారులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న సంఘటనలు చాలా ఉన్నాయి. ఏడాది పొడవునా నిండుగా పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడే ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రాజెక్టుపై వెలగని లైట్లు**

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆనకట్ట గుండా 60 లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ లైట్లు వెలిగించేందుకు భద్రత కోసం సిబ్బందిని నియమించారు. ఈ మధ్యకాలంలో రాత్రి వేళలో లైట్లు వేయడం లేదని జలాశయం చిమ్మ చీకట్లో కనిపిస్తుందని పరిసర గ్రామాల ప్రజల అంటున్నారు. అజ్జకొల్లు, రామన్‌పాడు ప్రజలు ఆత్మకూరు వెళ్లాలంటే చీకటిలో ప్రాజెక్టు మీద ప్రయాణం చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

**గుంతలమయమైన రోడ్డు..**

ప్రాజెక్టుకు వెళ్లాలంటే రోడ్డు మార్గం నరకాన్ని తలపిస్తుంది. వర్షాకాలంలో ఊకచెట్టు వాగుకు వరద పోటెత్తడంతో ఆత్మకూర్, అమరచింత మండలాలకు కార్లల్లో, ద్విచక్ర వాహనాలపై వెళ్లడానికి ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల ప్రాజెక్టు వరకు రోడ్ల మరమ్మత్తుల రూ.10 లక్షలు వెచ్చించి పనులు చేపట్టినా ఫలితం లేకపోయింది. అక్కడక్కడ కంప చెట్లు తొలగించి వదిలేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకే తాగు, సాగునీరు అందించే జలాశయంపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రాజెక్టు వద్ద చీకటిగా ఉంటుంది**



ఎంతో చరిత్ర కలిగిన రామన్‌పాడు ప్రాజెక్టుపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రామన్‌పాడు నుంచి ఆత్మకూరు వరకు రోడ్డుపై గుంతల్లో మురుగు నీరు కనిపిస్తుంది. రాత్రి వేళల్లో ప్రాజెక్టుపైన లైట్లు వేయడం లేదు. – అంజద్ అలీ, రామన్‌పాడు, మదనాపురం మండలం

**త్వరలో రోడ్డు మరమ్మతు**

రామన్‌పాడు ప్రాజెక్టుకు సంబంధించి రామన్‌పాడు గ్రామం నుంచి ఆత్మకూర్ వరకు లింకు రోడ్డు మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేస్తాం. ఈ మధ్య కాలంలోనే ప్రాజెక్టుపై 20 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశాం. రాత్రి వేళ సిబ్బంది ఉంటారు. సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. – జగన్‌మోహన్‌రెడ్డి, ఈఈ, నీటి పారుదల శాఖ, పెబ్బేరు డివిజన్

క్లుప్తంగా...

## నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదాల



సాక్షి, అమరావతి: నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని పార్టీ అధ్యక్షుడు, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియమించారని ఆ పార్టీ ప్రధాన కార్య దర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డే పోటీ చేస్తారని ప్రకటించారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సజ్జల రామ కృష్ణారెడ్డి, ప్రాంతీయ సమన్వయకర్త బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు సమావేశమ య్యారు. అనంతరం సజ్జల మీడియాతో మాట్లాడారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి 2024 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించిన ఆడియో ఇటీవల సర్క్యులేట్ అయ్యిందని గుర్తు చేశారు. టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాక కోటంరెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఖాళీ అయిన నెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త స్థానాన్ని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డితో సీఎం వైఎస్ జగన్ భర్తీ చేశారని వివరించారు. బాలి నేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూ రల్ నియోజకవర్గంలో ఇకపై ఆదాల ద్వారానే అన్ని కార్యక్రమాలు జరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఆదాల విజయం నల్లేరుపై నడకేనని ధీమా వ్యక్తం చేశారు.

## హుండీ ఆదాయంలో రికార్డుల మోత

**ఆపద మొక్కులవాడి ఆదాయం 11 నెలల్లోనే రూ.1,414.21 కోట్లు**

తిరుమల: ఆపద మొక్కులవాడికి సాధారణంగా మే, జూన్ నెలల్లో మాత్రమే హుండీ ద్వారా లభించే ఆదాయం నెలకు రూ.100 కోట్లు దాటేది. మిగిలిన నెలల్లో నెలకు రూ.100 కోట్లలోపే ఉండేది. ప్రస్తుతం శ్రీవారికి నిత్యం రూ.4 కోట్లకు పైగా హుండీ ఆదాయం లభిస్తోంది. టీటీడీ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా గత ఏడాది మార్చి నుంచి ప్రతినెలా హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటుతోంది. గడచిన 11 నెలల్లో రూ.1,414.21 కోట్లు రాగా.. ఈ ఏడాది రూ.1,500 కోట్ల మార్కును దాటిపోనుంది.

## తరలిపోతున్న తెల్ల బంగారం



పత్తి పంటకు ఆదిలాబాద్ జిల్లాలో సరైన మద్దతు ధర లేక మహారాష్ట్రకు తరలిపోతోంది. జిల్లాలో గురువారం పత్తి క్వింటాకు సీసీఐ ధర రూ.7,700 పలుకగా, ప్రైవేటు వ్యాపారులు రూ.7710కు కొనుగోలు చేశారు. జైనథ్ మండలం మాండగడ గ్రామం వద్ద పత్తిని వాహనంలో తరలిస్తుండగా కనిపించిన దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

# ట్యాపింగ్ కాదది.. రికార్డింగే

**జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లుగా చిత్రీకరిస్తూ చంద్రబాబు కుట్ర**

- **జాతీయ సమస్యగా దానిపై పోరాటం చేసే స్థాయికి దిగజారిన వైనం**
- ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి
- వైఎస్సార్‌సీపీ లేకుంటే ఎమ్మెల్యే అయ్యేవాడివా?
- ఏపీ మంత్రి పెద్దిరెడ్డి మండిపాటు
- ఇది నమ్మకద్రోహం
- మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం

సాక్షి, అమరావతి : 'ఏపీలో రాజకీయం చేయడానికి ఏ సమస్యా లేకపోవడంతో జరగనే జరగని ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు చిత్రీకరించి.. దానిని జాతీయ సమస్యగా సృష్టించి, పోరాటం చేసే స్థాయికి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు దిగజారారు. ఈ కుట్రలో కోటంరెడ్డి పాత్రధారి. ఇందులో భాగంగా కోటంరెడ్డి ప్రభుత్వంపై బురద చల్లి పార్టీ వీడాలనుకోవడం దారుణం. ఇంతకూ రికార్డ్ చేసింది కోటంరెడ్డి మిత్రుడే' అని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. గురువారం వారు వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

### టీడీపీలో చేరే వారు బావిలో దూకినట్లే

ఇష్టం లేనివారు టీడీపీలోకి వెళ్లాలనుకుంటే వెళ్లొచ్చు. కానీ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలనుకోవడం సమంజసం కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించకపోతే నీలాంటి వాళ్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యే వారా? కోటంరెడ్డి ఆరోపిస్తున్నట్లుగా అది ఫోన్ ట్యాపింగ్ కానే కాదు. ఆయన మిత్రుడే రికార్డ్ చేశారన్న విషయం కోటంరెడ్డికి కూడా తెలుసు. ఇదంతా చంద్రబాబు కుట్ర. ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు సీఎం వైఎస్ జగన్ భయపడరు. టీడీపీలో చేరే ఎమ్మెల్యేలు బావిలో దూకినట్టే.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి

### టీడీపీ రాజకీయ లబ్ధి కోసమే..



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ సంభాషణను ఆయన మిత్రుడే రికార్డింగ్ చేసి.. అందరికీ పంపారు. బయట సర్క్యులేట్ అవుతున్న ఆ ఆడియో క్లిప్‌ను ఇంటెలిజెన్స్ అధికారి కోటంరెడ్డికి పంపి, సరి చూసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో సమావేశమయ్యాక.. 2024లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పిన మాటల ఆడియో కూడా సర్క్యులేట్ అవుతోంది. చంద్రబాబుతోనూ లోకేశ్‌తోనూ కోటంరెడ్డి ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారని టీడీపీ నేతలే చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి ఉంటే.. చంద్రబాబుతో కోటంరెడ్డి సంప్రదింపులు జరుపుతున్నట్లుగా మేం అప్పుడే గుర్తించేవాళ్లం కాదా? టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు ద్వారా చంద్రబాబు.. మా ఫోన్లను ట్యాపింగ్ చేశారని.. దానిపై న్యాయస్థానంలో కేసు కూడా వేశాం. వాళ్లలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు రాజకీయ లబ్ధి కోసం టీడీపీ కుట్ర పూరితంగా చిత్రీకరిస్తోంది.


– సజ్జల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు

### డిసెంబర్ 25న బాబును కలిశారు



'నీ ఫోన్ సంభాషణను నీ మిత్రుడు రామశివారెడ్డి రికార్డ్ చేసి, అందరికీ పంపారు. అది బయట సర్క్యులేట్ అవుతుంటే.. ఇంటెలిజెన్స్ అధికారి దాన్ని నీకు వాట్సాప్‌లో పంపి.. సరి చూసుకోవాలని సూచించడంలో తప్పేముంది? ఇది వాస్తవం కాదంటే.. నీ ఫోన్‌కు సంబంధించి గత ఆర్నెల్ల వాట్సాప్ డేటాను బహిర్గతం చేయగలవా? కోటంరెడ్డిని సీఎం జగన్ ఎంతగానో నమ్మితే.. ఇలా నమ్మక ద్రోహానికి పాల్పడటం తగదు. 'డిసెంబర్ 25న బ్లూ కలర్ బెంజ్ కారులో చంద్రబాబు ఇంటికి కోటంరెడ్డి వచ్చి.. రెండు గంటలపాటు మాట్లాడి వెళ్లారు. ఇదివరకట్లాగే నారాయణతో సంబంధాలు కొనసాగించాలని బాబు చెప్పారు. లోకేశ్‌తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నారు. పాదయాత్రకు ముందు లోకేశ్ సలహాలు కూడా అడిగారు. కోటంరెడ్డి ఆస్పత్రిలో ఉన్నప్పుడు లోకేశ్ ఫోన్ ద్వారా పరామర్శించారు' అని టీడీపీ నేతలు, కోటంరెడ్డి పక్కనున్న వారే చెబుతున్నారు.

– పేర్ని నాని, మాజీ మంత్రి



కన్హా శాంతివనంలో గురూజీ కమ్లేశ్ పటేల్‌తో హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, న్యాయమూర్తుల బృందం

## దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారం

**లాలాజీ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో కేంద్రమంత్రి దేవుసింగ్ చౌహాన్**

నందిగామ: సమాజంలోని ప్రతివ్యక్తి ఆధ్యాత్మికతను అలవర్చుకున్నట్లయితే అందమైన ప్రపంచం తయారవుతుందని, దేశప్రగతికి ఆధ్యాత్మికత మూలాధారమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి దేవుసింగ్ జేసింగ్ భాయ్ చౌహాన్ అన్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతి వనంలో జరిగిన శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్ 150వ జయంతి ఉత్సవంలో ఆయన వర్చువల్ విధానంలో మాట్లాడారు. ప్రతి వ్యక్తి హార్ట్‌ఫుల్‌నెస్ పద్ధతి ద్వారా ధ్యానం చేసినట్లయితే ఆత్మశుద్ధి అవుతుందన్నారు. ప్రస్తుత గురూజీ కమ్లేశ్ పటేల్‌కు పద్మభూషణ్ అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. గురూజీ కమ్లేశ్ పటేల్ మాట్లాడుతూ ప్రాణాహుతి, హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ ప్రకాశ్, సర్కిల్ అధికారి రేవా ఆధ్వర్యంలో లాలాజీ స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రముఖ సంగీత కళాకారుడు హరిప్రసాద్ చౌరాసియా సంగీత విభావరి అలరించింది. ఉత్సవాలకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తోపాటు జస్టిస్ రాధా రాణి, జస్టిస్ ఎస్.నంద, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ భీమపాక నగేశ్, జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ నాగార్జున్, జస్టిస్ సురేందర్, జస్టిస్ సుధీర్‌కుమార్‌లు పాల్గొని ధ్యానం చేశారు.

## దేశవ్యాప్తంగా ఏపీ 'పెట్టుబడుల' సదస్సులు

- ముంబై, అహ్మదాబాద్, బెంగళూరు, కోల్‌కతా, త్రివేండ్రం, చెన్నై, హైదరాబాద్‌లో నిర్వహణ

సాక్షి, అమరావతి: పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా విశాఖలో మార్చి నెలలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సును విజయవంతం చేయడమే లక్ష్యంగా.. దేశవ్యాప్తంగా పెట్టుబడుల సన్నాహక సదస్సులను ఏపీ ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10 నుంచి 24 వరకు దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించేందుకు ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రణాళికలు రూపొందించింది. సీఎం జగన్ ఇటీవల ఢిల్లీలో ప్రారంభించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సు విజయవంతమవ్వడంతో.. అదే స్ఫూర్తితో ఈ రోడ్‌షోలను కూడా నిర్వహించబోతోంది. ఫిబ్రవరి 10న త్రివేండ్రం, కోల్‌కతా, 14న బెంగళూరులో, 17న చెన్నై, అహ్మదాబాద్, 21న ముంబై, 24వ తేదీన హైదరాబాద్‌లో ఈ రోడ్‌షోలు నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశమున్న వనరులు, ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రధానంగా 13 రంగాల్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా ఈ రోడ్ షోలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేశాయి. మార్చి 3–4 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఆ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతూ.. వాస్తవ ఒప్పందాలు చేసుకుంటాయని పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు.

## మాజీ సీఎస్ సోమేశ్‌కు బెయిలబుల్ వారెంట్

**కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు జారీ**



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో ఒక ప్లాట్‌కు సంబంధించిన వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టుకు హాజరుకావాలని పలుమార్లు ఆదేశించినా.. రాకపోవడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంది. హౌసింగ్ సొసైటీ వ్యవహారంలో కోర్టు తీర్పు అమలు చేయనందుకు సోమేశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నంకు చెందిన జయరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. మాజీ సీఎస్‌కు బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు.

## సౌత్‌జోన్ యూనివర్సిటీ టోర్నీకి కుషాం



మహబూబ్‌నగర్ క్రీడలు: తమిళనాడు రాష్ట్రంలోని పెరియార్‌లో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే జేఎన్‌టీయూ జట్టుకు జిల్లా కేంద్రం ధర్మాపూర్‌లోని జేపీఎన్‌సీఈ కళాశాల ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎంఏ.కుషాం ఎంపికయ్యాడు. ఈయన గతంలో జిల్లా తరఫున పలు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంపై కళాశాల చైర్మన్ కేఎస్.రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాల్ సుజీవన్ కుమార్ తదితరులు అభినందించారు. యూనివర్సిటీ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగుల వరకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 1,100, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

## నల్లమట్టి తరలింపుపై ఫిర్యాదు

బిజినేపల్లి: మండలంలోని మహదేవునిపేట శివారులో నిల్వ చేసిన నల్లమట్టిని వట్టెం జలాశయం కోసం ఆయా శాఖలకు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారని, సదరు కంపెనీపై కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీపాచారి గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నల్లమట్టి అక్రమ తరలింపులో భాగస్వాములైన వారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట భూషయ్య, సుధాకర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, వెంకట్‌రెడ్డి, బాలస్వామి, తిరుపతయ్య, యాదగిరి, సింహారెడ్డి, రాములు, భూపతి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు కాపీని చూపిస్తున్న దిలీపాచారి

# ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



వేంకటేశ్వరస్వామి ఆలయం

- నేటినుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 4న కల్యాణం, 5న రథోత్సవం, 6న శకటోత్సవం



లక్ష్మీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కలియుగదైవం పురాతన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏటా మాఘశుద్ధ త్రయోదశి మొదలు జాతర నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. మండలంలోని గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాలు ముగిసిన మూడు రోజుల తర్వాత జడ్చర్ల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజున సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణపూజ, అంకురార్పణం, గోపూజ, ప్రదోషపూజలు నిర్వహించనున్నారు.

### 4న కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శనివారం ధ్వజారోహణము, కల్యాణోత్సవం చేయనున్నారు. శాలిబండ రాఘవేంద్ర భజన మండలి, పాలమూరు రాఘవేంద్ర సేవా సమితి వారిచే భజనలు, సాయంత్రం పూలతేరు లాగనున్నారు. కల్యాణోత్సవానికి ఉమ్మడి జిల్లా నలుమూలలతో పాటు హైదరాబాద్‌నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. మూడవ రోజు ఆదివారం మద్భగవద్గీత, విష్ణుసహస్రనామ పారాయణం, రాత్రి 9గంటలకు మారుతి భజన మండలి, వెంకటేశ్వర భక్తమండలిచే చిడుతల భజనలు, 11 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. నాల్గవ రోజు సోమవారం శకటోత్సవం బండ్ల ఊరేగింపు చేయనున్నారు. ఆ తర్వాత వరసగా గరుడ, గజవాహన, శేష వాహన సేవలు 13న గరుడ, శేషవాహనసేవలపై ఊరేగించి చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

### ఆనవాయితీగా వస్తుంది..



ఏటా గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాల తర్వాత మూడురోజులకు లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది. ఉత్సవాల్లో ముఖ్యమైన కల్యాణోత్సవం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. అలాగే రథోత్సవం, శకటోత్సవం రోజున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం.

– కొత్త మధు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు, జడ్చర్ల


### విజయవంతం చేస్తాం..



బ్రహ్మోత్సవాల నిర్వహణలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఆలయ ధర్మకర్తతోపాటు భక్తులు సహకారంతో ఎప్పటిలాగే ఉత్సవాలు విజయవంతం చేస్తాం. ఆలయానికి భక్తులే ముఖ్యం కాబట్టి వారి సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– రంగాచారి, కార్యనిర్వహణ అధికారి

### 48 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం..



ఏటా మాఘమాసంలో నిర్వహించే లక్ష్మీవేంకటేశ్వర స్వామికి 48ఏళ్లుగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నాం. మా పూర్వీకులనుంచి వచ్చిన ఆచారాన్ని కొనసాగిస్తున్నాం. ఉత్సవాల కోసం ఇప్పటికే ప్రభుత్వ శాఖలకు సమాచారం అందించి ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతున్నాం.

– నరహరి భీంసేనాచార్య, ధర్మకర్త

## వైభవంగా గజవాహన సేవ



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలో గురువారం రాత్రి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి గజవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. గజవాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందు ఉన్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి సేవను చూసి భక్తి పారవశ్యంతో పులకించిపోయారు. ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, నిత్యానందచారి, శ్రీనివాస్‌గౌడ్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దాసంగం.. ప్రీతిపాత్రం

మన్యంకొండ స్వామికి దాసంగాలు ప్రీతిపాత్రం. అందుకే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు ఉపవాస దీక్షలతో స్వామివారికి దాసంగాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. దేవస్థానం కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి దాసంగాల వంటల ప్రక్రియను ప్రారంభిస్తున్నారు. కొత్త కుండలో స్వామివారికి అన్నం (నైవేద్యం) వండుతున్నారు. మరో కుండలో పచ్చిపులుసు చేసి దాసంగాన్ని తయారుచేస్తారు. ఈ కుండలకు నామాలు పెట్టి పూలతో అలంకరిస్తారు. అనంతరం దాసరులతో పూజలు చేయించి ఉపవాస దీక్షను విరమించి స్వామివారికి దాసంగాలు సమర్పిస్తారు. మన్యంకొండలో బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్ర వారం రాత్రి స్వామివారి సూర్యప్రభ వాహన సేవా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తారు.

## అడవి అభివృద్ధికి అన్ని జాగ్రత్తలు



కార్యాలయంలో నర్సరీని పరిశీలిస్తున్న ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ, డీఎఫ్‌ఓ, ఇతరులు

అమ్రాబాద్: అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్ట్ ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ సూచించారు. గురువారం అమ్రాబాద్ ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాన్ని డీఎఫ్‌ఓ రోహిత్‌గోపిడితో కలిసి సందర్శించారు. పలు రికార్డులు, నర్సరీలు చూసి, వివాదంలో ఉన్న అటవీ భూమిని పరిశీలించారు. అదే ప్రాంతంలో ఫైర్‌లైన్స్, ప్లాంటేషన్ చూశారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో అడవులు అంటుకునే అవకాశం ఉంటుందని ఇందు కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఫారెస్టు అధికారులకు సూచించారు. జంతువుల వేట, చెట్లు నరకడం వాటిని పూర్తిగా అరికట్టాలని, ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారి వెంట ఎఫ్‌ఆర్‌ఓ ప్రభాకర్, సెక్షన్ అధికారి స్వప్నారెడ్డి, ఎఫ్‌బీఓ నాగేష్ తదితరులు ఉన్నారు.

# తల్లిని హతమార్చిన కొడుకు

- డబ్బుల కోసం రోకలిబండతో మోది హత్య
- భూత్పూర్ మండలం మద్దిగట్లలో ఘటన



బీరమ్మ (ఫైల్)

భూత్పూర్: డబ్బుల కోసం కన్న తల్లిని హతమార్చిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో చోటు చేసుకుంది. సీఐ రజితారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిగట్ల పూల బీరమ్మ (55)కు కుమారుడు, కూతురు ఉన్నారు. కొన్నేళ్ల క్రితమే బీరమ్మ భర్త బాలమాసయ్య మృతి చెందగా, కుమారుడు, కూతురి వివాహం కాగా కుమారుడు బీరయ్య నవాబుపేట మండలం కూచురుకు ఇల్లరికంగా వెళ్లిపోయి, అక్కడే ఉంటున్నాడు. దీంతో బీరమ్మ పొలం అమ్మి వచ్చిన డబ్బులను తన వద్దనే పెట్టుకొని మద్దిగట్లలో తన ఇంట్లో నివాసం ఉంటుంది. ఏడాదిగా తనకు డబ్బులు ఇవ్వాలని కుమారుడు బీరయ్య తరుచూ తల్లితో గొడవపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఓ పని నిమిత్తం కొత్త మొల్గర గ్రామానికి తల్లి బీరమ్మ వెళ్లగా.. అక్కడికి కుమారుడు బీరయ్య సైతం వచ్చాడు. డబ్బుల విషయంలో మరోసారి గొడవ పడ్డాడు. సాయంత్రం బీరమ్మ మద్దిగట్లకు రాగా, బీరయ్య సైతం మద్దిగట్లకు బుధవారం రాత్రి వెళ్లి ఇంట్లోని రోకలి బండతో తలపై గట్టిగా బాది తలుపు మూసేసి వెళ్లిపోయాడు. గురువారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న వారికి ఫోన్ చేసి తన తల్లి ఫోన్ ఎత్తడం లేదని వెళ్లి చూడమని బీరయ్య చెప్పడంతో.. వారు వెళ్లి చూడడంతో రక్తం మడుగులో ఉన్న బీరమ్మను చూసి, కుమారుడు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మద్దిగట్లకు వచ్చిన బీరయ్యపై అనుమానంతో గ్రామస్తులు నిలదీయడంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. సీఐ, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి వెళ్లి సంఘటన విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అప్పటికే అక్కడి నుంచి బీరయ్య జారుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, బీరయ్య పరారీలో ఉన్నాడని సీఐ పేర్కొన్నారు.

## చిన్నోనిపల్లె భూ నిర్వాసితుల అరెస్ట్

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఆందోళన చేస్తున్న భూ నిర్వాసితులను గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ప్రారంభమవుతున్న తరుణంలో భూ నిర్వాసితులు చలో అసెంబ్లీ కార్యాక్రమానికి పిలుపునిచ్చిన తరుణంలో 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.